సాక్షి నల్లగొండ

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



అత్యధిక మెజార్టీ సాధించాలి
నల్లగొండ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీ సాధించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



వరుస చోరీల నిందితుల అరెస్టు
మహిళల మెడలో బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం
41° / 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వేడి గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

24, 25న కేసీఆర్ బస్సుయాత్ర

- మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరిలో రోడ్‌షో

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 24, 25న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన చేపడుతున్న బస్సుయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభం అవుతుంది. బస్సు యాత్రలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో 24న సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. అనంతరం సూర్యాపేటకు చేరుకుని రాత్రి 7గంటలకు రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రి సూర్యాపేటలో బస చేస్తారు. 25న సాయంత్రం భువనగిరి చేరుకుని ఆరు గంటలకు పట్టణంలో నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. అనంతరం ఎర్రవెల్లికి బయలుదేరి వెళ్తారని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి.

మే 26 నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

నల్లగొండ రూరల్: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి నిర్వహించనున్నట్లు నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాల దూర విద్య కేంద్ర కోఆర్డినేటర్ సుంకరి రాజారామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ మే 26 నుంచి జూన్ 1 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెమిస్టర్ పరీక్ష ఫీజును మే 6 లోపు చెల్లించాలని, పూర్తి వివరాలకు ఫోన్ 7382929758, 9553568049 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ: అర్హులైన ప్రతిఒక్కరూ లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని స్వీప్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలోని 75వ పోలింగ్ స్టేషన్‌లో స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకుమెప్మా పీడీ కరుణాకర్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలోని అతి తక్కువ ఓటింగ్ నమోదైన ఏడు ప్రాంతాల్లో మిర్యాలగూడ పట్టణంలోని 75వ పోలింగ్ స్టేషన్ ఉందని, ఇక్కడ పోలింగ్ శాతం పెంచేందుకు స్వీప్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదదస్సులో స్వీప్ అధికారి దివ్య అరుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, డీఎల్‌పీఓ రాఘవరావు, డీఆర్‌డీఏ డీపీఎం అరుణ్‌కుమార్, మెప్మా సీఓలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన ఇద్దరికి షోకాజ్ నోటీసులు

మర్రిగూడ: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన మర్రిగూడ ఏఈఓ విజయ్‌కుమార్, ఐకేపీ సీసీ భారతమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మునుగోడు ఏడీఏ ఎల్లయ్య, ఏపీఎం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఏఈఓను నాంపల్లి మండలానికి బదిలీ చేయగా సీసీని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విధుల నుంచి తొలగించి మరో సీసీ కిషన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

బాయిల్డ్ రైస్ ఇవ్వాలని ఆదేశించాం : ఎఫ్‌సీఐ జీఎం

నల్లగొండ: జిల్లాలోని మిల్లర్లు 1.19 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్ అన్నారు. శనివారం ఆయన నల్లగొండలో మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. 10 లక్షల మెట్రిక్ టన్నుల రా రైస్ ఇవ్వాలని చెప్పగా ఇప్పటికే 6వేల మెట్రిక్ టన్నులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యపూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అలాగే ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.

ఆ వ్యాఖ్యల వెనుక..

అంతర్యమేమిటి?

- బీఆర్‌ఎస్ అంతర్గత విషయాలపై గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శలు
- పరోక్షంగా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- కొందరు అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు చేశారని వెల్లడి
- ఆయన కుమారుడికి దక్కని ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు
- మదర్ డెయిరీ చైర్మన్ పదవి నుంచి తన తమ్ముడిని తప్పించారని ఆక్రోశం
- గుత్తా వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్టీ అధిష్టానం తీరుపైనే శనివారం గుత్తా సుఖేందర్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేయడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్ తరపున శాసన మండలి చైర్మన్ అయిన సుఖేందర్‌రెడ్డి ఇప్పుడు పార్టీకి వ్యతిరేకంగా విమర్శలు చేయడం పట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది. శనివారం తన స్వగ్రామమైన ఉరుమడ్లలో మీడియా ప్రతినిధులతో గుత్తా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తరువాత పార్టీ గెలుపోటములపై కేసీఆర్ సమీక్ష చేయలేదని.. చెప్పే అవకాశం కేసీఆర్ ఇవ్వరని, తనకు రాలేదని, పార్టీ సంస్థాగత నిర్మాణమే లేదని ఘాటు విమర్శలు చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో.. రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు 100 మంది ఇన్‌చార్జిలను దింపితే కొద్ది మెజారిటీతో గెలిచామని, దానిపై సమీక్ష చేయకపోగా, మళ్లీ వారికే పార్టీ బాధ్యతలు అప్పగింగిందంటూ, వారి వల్లే నష్టం జరిగిందంటూ పరోక్షంగా జగదీష్‌రెడ్డిపై కూడా విమర్శలు చేశారు. తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ అభ్యర్థులను మార్చకుండా, ఎవరిని పెట్టినా గెలుస్తారనే అహంకారంతో వ్యవహరించడం వల్లే ప్రజలకు దూరమయ్యామని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సుఖేందర్‌రెడ్డి వ్యతిరేకించినందునే ఎమ్మెల్యేలు ఓడిపోయారంటే.. 2018 పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అప్పుడు 9 సీట్లు గెలిచామని, 2019లో రెండు పార్లమెంట్ స్థానాలను ఎందుకు కోల్పోయామని ప్రశ్నించారు. కొందరు కావాలనే తమపై అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు చేశారని, అది ఎవరన్నది అందరికి తెలుసునని పేర్కొన్నారు.

అమిత్‌కు అసెంబ్లీ టికెట్ నుంచి మొదలుకొని..

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు టికెట్ ఆశించారు. పార్టీ పెద్దలను కలిసినా ఆయనకు టికెట్ దక్కలేదు. పార్టీలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అమిత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా జిల్లాలోనూ పూర్తిగా వెనుకబడిపోయింది. 12 స్థానాలు ఉంటే ఒక్క స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే గుత్తా సుఖేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారనే వార్తలు జోరందుకున్నాయి. వాటన్నింటికి గుత్తా పలు సందర్భాల్లో కొట్టిపారేశారు. తనకు పార్టీ మారాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు.

ఎంపీగా పోటీ చేస్తామంటే దక్కని సహకారం

ఎంపీ ఎన్నికలు రావడంతో నల్లగొండ టికెట్‌ను అమిత్ ఆశించారు. అయితే ఇందుకు కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఓ మాజీ మంత్రి వ్యతిరేకించినట్లు చర్చసాగింది. ఆ తరువాత నల్లగొండ లేదా భువనగిరి టికెట్ అయినా ఇవ్వమని అధిష్టానం ముందు ప్రతిపాదన పెట్టారు. అందుకు కేటీఆర్, హరీష్‌రావు, చివరకు కేసీఆర్ కూడా ఓకే చెప్పినట్లు సుఖేందర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. అయినా అమిత్‌కు టికెట్ రాలేదు. తన కుమారుడు అమిత్‌కు టికెట్ ఇవ్వడానికి అధిష్టానం ఓకే చెప్పిన సమయంలో అమిత్ వెళ్లి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలను కలువడానికి ప్రయత్నిస్తే కొందరు కలిశారని, మరికొందరు కలువడానికి టైం ఇవ్వలేదని, ఇంకొందరు తాము పార్టీలో ఉంటామో లేదోనన్న భావనలో ఉన్నారనేది అర్థమైందని చెప్పుకొచ్చారు. సమన్వయం లేని ఇలాంటి పరిస్థితుల్లో అమిత్ పోటీ చేయడం కరెక్ట్ కాదనే ఉద్దేశంతోనే అమిత్ పోటీ నుంచి విరమించుకుంటున్నట్లుగా అధిష్టానానికి తెలియజేసినట్లు వివరించారు.

జగదీష్‌రెడ్డి టార్గెట్‌గా...

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి టార్గెట్‌గా ఆయన పేరును ప్రస్తావించకుండా సుఖేందర్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల వేళ పార్టీని దిక్కరించడమే కాకుండా, జగదీష్‌రెడ్డిపై ఉన్న ఆక్రోషాన్ని వెళ్లగక్కినట్లు చర్చ జరుగుతోంది. మునుగోడు ఉప ఎన్నికపై కనీస సమీక్ష చేయకుండా మళ్లీ వారికే అధికారాన్ని అప్పగించారని విమర్శలు చేశారు. మదర్ డెయిరీ చైర్మన్ పదవి విషయంలోనూ సుఖేందర్‌రెడ్డి ఆరోపణలు చేశారు. తన తమ్మునికి ఉన్న మదర్ డెయిరీ చైర్మన్ పదవిని తొలగించి, డబ్బులు తీసుకొని కృష్ణారెడ్డికి ఇచ్చారనే ఆరోపణలు ఉన్నట్లు చెప్పుకొచ్చారు. అలాంటి చిల్లర వేశాలు వేసే వారు వేస్తారని, తాను పట్టించుకోనని అన్నారు. ఈ విషయాలు పరిశీలిస్తే.. జగదీష్‌రెడ్డి లక్ష్యంగానే గుత్తా మాట్లాడినట్లు తెలుస్తోంది.

ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేస్తాం : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి స్పందించారు. 'సుఖేందర్‌రెడ్డి సీనియర్ నాయకుడు. ఆయన నాపై వ్యక్తిగత కామెంట్స్ చేయలేదు. ఆయన రాజకీయాలు చేసినప్పుడు నేను పుట్టలేదు. ఆయన అనుభవాన్ని ప్రభుత్వంలో వినియోగించుకోవాలని, రాష్ట్రంలో సీఎం తరువాత ప్రాధాన్యం కలిగిన మండలి చైర్మన్ పదవిని కేసీఆర్ ఇచ్చారు. కేసీఆర్‌పై ఆయన ఏ ఉద్దేశంతో వ్యాఖ్యలు చేశారో తెలియదు. ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేస్తాం. ఎన్నికల తరువాత పార్టీ నిర్మాణంపై ఆయన చెబుతన్నట్లుగా సుఖేందర్‌రెడ్డి సేవలను కేసీఆర్ వినియోగించుకుంటారు' అని జగదీష్‌రెడ్డి అన్నారు.

సమష్టిగా పనిచేసి లక్ష్యం సాధించాలి



సూర్యాపేటలో ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

భానుపురి (సూర్యాపేట) : ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది సమష్టిగా పనిచేసి సంస్థ యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యం సాధించాలని ఆర్టీసీ నల్లగొండ ఆర్‌ఎం శ్రీదేవి సూచించారు. శనివారం జిల్లాకేంద్రంలోని డిపో ఆవరణలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీని అప్పుల నుంచి లాభాల బాటలోకి తెచ్చేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఇందులో భాగంగా మనుగడ కోసం మార్పు చాలెంజ్‌తో నష్టాల్లో ఉన్న డిపోలను లాభాల్లోకి తెచ్చి సమయానికి జీతాలు ఇచ్చే స్థితికి వచ్చామన్నారు. ఈ ఏడాది ఉగాది నుంచి లక్షే లక్ష్యం పేరుతో ఏడాది పాటు ప్రతి డిపో ప్రస్తుత ఆదాయానికి అదనంగా లక్ష రూపాయలు సాధించాలని ఎండీ సజ్జనార్ లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. అనంతరం మార్చి నెలలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎం సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, నాగమణి, కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

- విధులకు హాజరుకానందుకే చర్యలు
- మరొకరికి మెమో జారీ చేసిన డీఈఓ

అడవిదేవులపల్లి: తరచూ విధులకు గైర్హాజరవుతున్న అడవిదేవులపల్లి మండలం బంగారికుంటతండా మండల పరిషత్ ప్రాథమి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.జానారెడ్డి, ఉపాధ్యాయుడు టి.చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ ఎం.బాలాజీనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల రిజిష్టర్ల నిర్వహణలో నిబంధనలు పాటించని చిట్యాల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సతీష్‌కు కూడా డీఈఓ మెమోను జారీ చేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల హాజరుశాతం పెంచేలా బాధ్యతను వహించాలని, లేనియడల శాఖపరమైన చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

నేడు కవి సమ్మేళనం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని సుధాబ్యాంక్ ఆడిటోరియంలో మనం వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 56వ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమ్మేళనానికి కవులు హాజరుకావాలని కోరారు.

మరో రెండు మోటార్లకు ట్రయల్ రన్



మోటార్లను పరిశీలిస్తున్న హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ సుదర్శన్‌రెడ్డి, అధికారులు



మోటార్ల వద్ద ఆందోళన చేస్తున్న కూలీలు

పెద్దఅడిశర్లపల్లి: నాగార్జునసాగర్ జలాశయం అడుగంటడంతో జంట నగరాలకు తాగునీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్న ఎమర్జెన్సీ మోటార్ల ట్రయల్ రన్‌ను హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గురువారం నుంచి ఏడు మోటార్లకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు శనివారం 60 క్యూసెక్కుల సామర్థ్యమున్న రెండు మోటార్లకు ట్రయల్ రన్ నిర్వహించారు. మొత్తం తొమ్మిది మోటార్ల ద్వారా 480 క్యూసెక్కుల నీటిని సాగర్ వెనుక జలాల నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా పుట్టంగండి మోటార్లకు సరఫరా చేస్తున్నారు.

నీటి సరఫరాకు అంతరాయం కలగొద్దు

ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నుంచి జంట నగరాలకు తాగు నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి వద్ద గల సాగర్ వెనుక జలాలను తరలించడానికి ఏర్పాటు చేస్తున్న ఎమర్జెన్సీ మోటార్ల ట్రయల్ రన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఈడీ సత్యనారాయణ, డైరెక్టర్లు రవికుమార్, సుదర్శన్, సీజీఎం దశరథరెడ్డి, జీఎం శ్రీధర్, డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎమర్జెన్సీ మోటార్ల వద్ద కూలీల ఆందోళన

ఎమర్జెన్సీ మోటార్ల వద్ద శనివారం కూలీలు ఆందోళన చేపట్టారు. అప్రోచ్ కెనాల్‌లో ఆనకట్ట కట్టేందుకు గ్యాబియన్స్, ఇసుక బస్తాలు నింపడంలో కాంట్రాక్టర్ తమకు సరిపడా కూలీ ఇవ్వడకుండా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై డీజీఎం బాబును వివరణ కోరగా సబ్ కాంట్రాక్టర్, కూలీల మధ్య సమన్వయ లోపంతో ఈ సమస్య తలెత్తిందని వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు భువనగిరికి సీఎం రాక

- సాయంత్రం 4 గంటలకు కార్నర్ మీటింగ్
- భారీ జన సమీకరణకు నాయకుల కసరత్తు



సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి పర్యటన ఏర్పాట్లపై సీపీతో చర్చిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం భువనగిరి పట్టణంలో పర్యటించనున్నారు. అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించనున్నారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడనున్నారు. రోడ్ షోకు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లనుంచి భారీగా జన సమీకరణ చేసేందుకు పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

వినాయకచౌరస్తాలో కార్నర్ మీటింగ్

భువనగిరిలోని వినాయక చౌరస్తాలో సాయంత్రం 4 గంటలకు కార్నర్ మీటింగ్ ఉంటుంది. అంతకుముందు హైదరాబాద్ చౌరస్తా నుంచి వినాయక చౌరస్తా వరకు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు షో నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి హైదరాబాద్ నుంచి భువనగిరికి హెలికాప్టర్ లేదా రోడ్డు మార్గంలో చేరుకుంటారు. భువనగిరి శివారులోని సూర్యవంశీ స్పిన్నింగ్ మిల్లువద్ద హెలిపాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా హైదరాబాద్ చౌరస్తా వరకు చేరుకుని ఓపెన్ టాప్ వాహనంలో వినాయక చౌరస్తా వరకు వస్తారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సాయిబాబా గుడి వరకు వరకు ర్యాలీ ఉంటుంది. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఉమ్మడి జిల్లాకు రావడం రెండవ సారి కాగా.. భువనగిరికి ఇదే ప్రథమం. మొదటిసారి యాదగిరిగుట్టకు బ్రహ్మోత్సవాలకు వచ్చారు.

హాజరుకానున్న మంత్రులు

కార్నర్ మీటింగ్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, భువనగిరి లోక్ సభ నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్‌తోపాటు భువనగిరి, ఆలేరు, ఇబ్రహీంపట్నం, జనగామ, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్లు పాల్గొననున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వస్తే భువనగిరి పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగనున్నారు. రోడ్డు మార్గంలో వస్తే పెద్ద చెరువు నుంచి టాప్‌లెస్ బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ హైదరాబాద్ చౌరస్తా, జగదేవ్‌పూర్ చౌరస్తా మీదుగా వినాయక చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ కార్నర్ మీటింగ్ అనంతరం సాయిబాబా గుడి వరకు ర్యాలీగా ముందుకు సాగుతారు. భద్రత దృష్ట్యా రోడ్డుకు ఒక వైపు మాత్రమే ర్యాలీకి అనుమతి ఉంటుందని సీపీ తరుణ్‌జోషి తెలిపారు. పర్యటన ఏర్పాట్లను రాచకొండ సీపీ తరుణ్‌జోషి, డీసీపీ రాజేశ్ చంద్ర, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం పరిశీలించారు.

మూడో రోజు ఏడుగురు నామినేషన్

- నల్లగొండలో అంతా స్వతంత్ర అభ్యర్థులే..
- ఇప్పటి వరకు 15 మంది నామినేషన్లు దాఖలు



నల్లగొండ : స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కుక్కల వెంకన్న

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ స్థానానికి మూడో రోజైన శనివారం ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు తమ నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు. నామినేషన్లు వేసిన వారిలో కుక్కల వెంకన్న, పాలకూరి రవి, పాలకూరి రమాదేవి, పనస వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి కోటిరెడ్డి, తండు ఉపేందర్‌గౌడ్, మారం వెంకట్‌రెడ్డి ఉన్నారు. అయితే తొలి రోజు నలుగురు, రెండో రోజు నలుగురు, మూడో రోజు ఏడుగురితో కలిపి మొత్తం 15 మంది నామినేషన్లు సమర్పించారు.

భువనగిరిలో ఐదుగురు..

భువనగిరి టౌన్: భువనగిరి లోక్‌సభ స్థానానికి మూడో రోజు శనివారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థిగా ధీరావత్ గోపినాయక్,బహుజన్ రిపబ్లిక్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి కదిరే కిరణ్‌కుమార్, బహుజన్ ముక్తి పార్టీ తరపున పెంట రమేష్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి కొంగరి లింగస్వామి ఒక్కో సెట్ వేయగా మరో స్వతంత్ర అభ్యర్థి ఊదరి మల్లేశం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు. కాగా మూడు రోజుల్లో మొత్తం 14 నామినేషన్లు వచ్చాయి.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



హోటల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న స్వాతి

చిట్యాల: హోటళ్ల యజమానులు వినియోగదారులకు విక్రయించే ఆహార పదార్థాల విషయంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి ఆదేశించారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటల్స్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. పలు హోటళ్లలోని ఫ్రీజర్స్‌లో ఉంచిన, మిగిలిన ఆహార పదార్థాలు, వంట గదులను పరిశీలించారు. నిబంధనలు పాటించని ఒక హోటల్‌ను సీజ్ చేశారు. పలు హోటల్స్‌కు రూ.25 వేల చొప్పున జరిమానాను విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు హోటళ్లలోని అపరిశుభ్రంగా ఉన్న ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపించామని, పరీక్షల అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శివ, రమేష్ పాల్గొన్నారు.

11.47 లక్షల ఎకరాలతో సాగు ప్రణాళిక

- వానాకాలం పంటల సాగు ఖరారు చేసిన వ్యవసాయ శాఖ
- వరి, పత్తి కలిపి 10,59,160 ఎకరాల్లో సాగవుతుందని అంచనా
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్న యంత్రాంగం



గత వానాకాలంలో సాగైన పత్తి

నల్లగొండ అగ్రికల్చర్: వచ్చే వానాకాలం-2024 సీజన్ పంటల సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. గత వానాకాలం సీజన్‌లో 9,92,801 ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటలను రైతులు సాగు చేశారు. అయితే ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం 11,47,954 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు ప్రణాళికను ఖరారు చేసింది. అందులో వరి 5,19,160 ఎకరాలు, పత్తి 5.40లక్షల ఎకరాలు, కంది 4,710, పెసర 1,468, మినుములు 946, జొన్న 185, నువ్వులు 35, వేరుశనగ 1,145, జనుము 56,030, జీలుగ 15,440, పిల్లి పెసర 8,835 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది.

విత్తనాలు ఇలా..

వానాకాలం సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. సీజన్‌కు ముందుగానే రైతులకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచేందుకుగాను విత్తనాల కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు నివేదికను అందజేసింది. వరి విత్తనాలు 1,04,294 క్వింటాళ్లు, పత్తి విత్తనాలు 15 లక్షల ప్యాకెట్లు, కంది విత్తనాలు 1,413 క్వింటాళ్లు, మినుము 946 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 117 క్వింటాళ్లు, జొన్న విత్తనాలు 7 క్వింటాళ్లు, వేరుశనగ 6.87 క్వింటాళ్లు అవసరంగా గుర్తించి రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు నివేదించింది.

మృగశిరలోనే వరినాట్లకు అవకాశం

మే నెలాఖరున కాని జూన్ మొదటి వారంలో గాని వర్షాలు కురిస్తే వెంటనే రైతులు వేసవి దుక్కులను దున్నడానికి సన్నద్ధమవుతున్నారు. దుక్కులను దున్నుకుని సిద్ధంగా ఉంచుకుంటే జూన్‌లో వర్షాలు పడగానే మృగశిర కార్తె ఆరంభంలోనే వరినార్లు పోసుకోవడంతో పాటుగా పత్తి విత్తనాలను విత్తుకునే అవకాశం ఉంది. ఈ సారి వానాకాలం సీజన్‌లో నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ చెప్పుతున్న నేపథ్యంలో సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



వానాకాలం సీజన్‌లో 11 లక్షల ఎకరాలలో వివిధ పంటలను రైతులు సాగు చేయనున్నారని అంచనా వేశాం. దానికి అనుగుణంగా సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

అన్నదమ్ములిద్దరూ..

భువనగిరి నుంచే తొలిసారి ఎంపీలు


వెంకట్‌రెడ్డి


రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: కోమటిరెడ్డి సోదరులు ఇద్దరూ భువనగిరి నుంచే తొలిసారి ఎంపీలయ్యారు. 2009లో నూతనంగా ఏర్పడిన భువనగిరి లోక్‌సభ స్థానానికి ఇప్పటి వరకు మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజకీయ అరంగ్రేటం చేసిన తొలిసారే 2009లో కాంగ్రెస్ నుంచి భువనగిరి ఎంపీగా గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి టీఆర్‌ఎస్ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ చేతిలో ఓటమి చెందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి లోక్‌సభ స్థానానికి పోటీచేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తొలిసారి ఎంపీగా విజయం సాధించారు. నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కూడా కొనసాగిన వెంకట్‌రెడ్డి.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండలో ఓడిపోయారు. ఈ తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై విజయం సాధించారు. కోమటిరెడ్డి సోదరులిద్దరూ భువనగిరి నుంచే పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

అత్యధిక మెజార్టీ సాధించాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: రాష్ట్రంలోనే నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీ సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగరపట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీ సాధించేలా పనిచేయాలన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రాజీవ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించే ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సభ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జునరావు, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, ఈడ్పుగంటి సుబ్బారావు, దొంతగాని శ్రీనివాస్, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, గెల్లి రవి తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చింతలపాలెంలో..

చింతలపాలెంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయించి వచ్చే సీజన్ కల్లా రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎస్. కొండారెడ్డి, ఎస్. ఇంద్రారెడ్డి, సీపీఐ నాయకులు ఉస్తేల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి కల్లబొల్లి మాటలు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్): అమలుకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్లులో నిర్వహించిన భారీ రోడ్ షోలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో కాళేశ్వరం జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలకు చుక్కలు చూపెడుతూ గోస పెడుతోందన్నారు. పంటలకు నీళ్లు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం రేవంత్‌ది అని విమర్శించారు.

రూ.4వేల పింఛన్ ఇస్తామన్న ప్రభుత్వం నేటికీ ఇవ్వడం లేదన్నారు. రూ.4వేల పింఛన్ వచ్చే వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, రాని వారు బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఆడ పిల్లలకు స్కూటీలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు దద్దమ్మల్లా మారి రైస్ మిల్లర్లను, కంకర మిల్లుల నిర్వాహకులను బెదిరింపులకు గురిచేస్తూ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతు బిడ్డకు, రాజకీయ నాయకుడి బిడ్డకు మధ్య పోటీ అని, రైతు బిడ్డనైన తనను గెలిపించి లోక్‌సభకు పంపితే రైతుల పక్షాన కొట్లాడుతానన్నారు. ఈ సందర్భంగా దండుమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోడ్‌షోలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, తూడి నర్సింహారావు, కొణతం సత్యనారాయణరెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి, పక్కన నల్లగొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి


దండుమైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జగదీష్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి

ఎనీ డౌట్.. డయల్ 1950

- ఓటర్లు సమాచారం తెలుసుకునేలా, ఫిర్యాదులు చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం

భువనగిరిటౌన్: కొత్తగా ఓటు హక్కు పొందాలంటే ఎవరిని సంప్రదించాలి? ఒకవేళ ఓటు హక్కు ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది? అనే సమాచారాన్ని ఓటర్లు తెలుసుకోవాలన్నా.. ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు డబ్బు, మద్యం, కానుకలు పంపిణీ చేసినా నేరుగా ఫిర్యాదు చేసేలా ఎలక్షన్ కమిషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1950ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఎక్కడి నుంచైనా టోల్‌ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంకు సమాచారం వెళ్తుంది. అక్కడ ఎవరూ ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి ఫోన్ కనెక్ట్ అవుతుంది. సిబ్బంది ఆ సమాచారాన్ని నమోదు చేసుకుని ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఓటర్లకు కావాల్సిన సమాచారం చేరవేస్తారు. ఇప్పటివరకు ఈ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాలో 100కు పైగా ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. కంట్రోల్ రూం వద్ద 24 గంటల పాటు సిబ్బంది పనిచేస్తున్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న భువనగిరి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం సిబ్బంది

అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్

- నామినేషన్ ప్రక్రియలో అనుమానాల నివృత్తి కోసం ఏర్పాటు

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి పోటీ చేయాలనుకునే వారు భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్‌ఓ) కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. నామినేషన్లకు సంబంధించి ఏదైనా సమాచారం కావాలంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సంబంధిత అధికారులు సూచించారు. సువిధ యాప్ ద్వారా ఈసారి ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు దాఖలు చేయవచ్చు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు పార్టీలు జారీచేసే ఏ, బీ ఫాంను నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా సంబంధిత ఆర్‌ఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.


భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌లో కూర్చున్న అధికారులు

మహిళా రిజర్వేషన్ ఘనత మోదీదే


మాట్లాడుతున్న నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, చిత్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి తదితరులు

- నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్: చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు మహిళా బిల్లు తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా శక్తి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మహిళల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం పెట్టపీట వేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలందరూ బీజేపీని గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ కుటుంబ పాలనను ఓడించేందుకు మహిళలు నడుం బిగించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి మాట్లాడుతూ బీజేపీతోనే మహిళల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, పార్లమెంట్ ప్రబారీ చాడ శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, కంకణాల నివేదిత, శానంపూడి రజిత, మందడి కరుణ, పిల్లి రామరాజుయాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ, శకుంతల, సులోచన, నీరజ, లక్ష్మీ ప్రసన్న, సంధ్య, దాసోజు అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ సమయంలో అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, తప్పుడు అఫిడవిట్ సమర్పించినా చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఊరేగింపులకు అనుమతి తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అభ్యర్థి అనుమతి పొందిన వాహనాలను మాత్రమే ఉపయోగించాలని, ఊరేగింపు, ర్యాలీ సమయంలో రెచ్చగొట్టే విధంగా మాట్లాడవద్దని పేర్కొన్నారు. వాహనాలకు లౌడ్ స్పీకర్లు పెట్టుకునేందుకు అనుమతి పొందాలని, వాహనానికి రిటర్నింగ్ అధికారి ముందస్తు అనుమతి ఉండాలని అందుకు సంబంధించిన ఉత్తర్వుల కాపీ వాహనంపై అతికించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోకి రావడానికి మూడు వాహనాలకే పరిమితం ఉందని, ఇతర వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.

• పోలింగ్ కేంద్రాల్లో వాల్ రైటింగ్



పోలింగ్ బూత్‌ల వద్ద లోక్‌సభ నియోజకవర్గం, అసెంబ్లీ సెగ్మెంట్, పోలింగ్ కేంద్రం, పోలింగ్ కేంద్రంలోకేషన్, బీఎల్‌ఓ పేరు, ఫోన్ నంబరు, ముఖ్య ఎన్నికల అధికారుల నంబర్లు ఓటర్లకు తెలిసేలా ఎలక్షన్ సిబ్బంది వాల్ రైటింగ్ ముమ్మరం చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మొత్తం 264 పోలింగ్ బూత్‌లు ఉండగా.. ఇప్పటి వరకు 90 బూత్‌లలో వాల్ రైటింగ్ పూర్తయ్యింది. - మిర్యాలగూడ టౌన్

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

- గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలు అంటూ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారో చెప్పాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఏ ఒక్క ప్రజాప్రతినిధి స్పందించడంలేదన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సంతోషంగా ఉన్న రైతులు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పటివరకు దాని ఊసే ఎత్తకుండా ఇప్పుడు ఎంపీ ఎన్నికలు వస్తున్నాయని చెప్పి ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తానని అంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల సమస్యలను లోక్‌సభలో ప్రస్తావిస్తానని చెప్పారు. కార్యక్రమంలో యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, జిల్లా నాయకులు బాషబోయిన ఉప్పలయ్యయాదవ్, నాయకులు పి. పూర్ణచందర్ రాజు, గడ్డం దశరథగౌడ్, సోలిపురం అరుణ, పంజాల వెంకటేష్, కోరె వెంకన్న, నాతి రాజు, కోరె బీరప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గొంగిడి సునీత, పక్కన భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

మిర్యాలగూడ అర్బన్ : లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు గాను ఎన్నికల కమిషన్ అందజేసిన ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచే గదిని ఆయన పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర బలగాలతో 24గంటల పాటు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు.


ఈవీఎంలు భద్రపరిచే గదిని పరిశీలిస్తున్న డీఎస్పీ

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

- భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నకిరేకల్: దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ పట్టణంలో శనివారం రాత్రి ఆయన స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట వ్యాపారస్తులను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం వివిధ కుల, వ్యాపార సంఘాల విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీలను ప్రజలు నమ్మొద్దన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చామల శ్రీనివాస్, బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాజుల సుకన్యశ్రీనివాస్, గాదగోని కొండయ్య, ఎల్లేష్, నకిరేకంటి నరేందర్, బ్రహ్మదేవర రమేష్, కదిరె రమేష్, గునగంటి రాజు, ఉగ్గిడి శ్రీనివాస్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్‌లో వ్యాపారస్తులను ఓటు అభ్యర్థిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

ఖమ్మం క్రైం: నిరుద్యోగ యువతే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన పారేపల్లి సాయికృష్ణ అలియాస్ సాయి, పెట్రోల్ బంక్ ఉద్యోగి రావులపాటి శివ హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నివాసముంటున్నారు. వివిధ ఇంజినీరింగ్ కాలేజీల హెచ్‌ఓడీలకు సంబంధించిన ఫోన్ నంబర్లను వెబ్‌సైట్ల ద్వారా సేకరించిన వారు అదే కాలేజీ పూర్వవిద్యార్థులుగా, ఐబీఎం ఉద్యోగులుగా చెబుతూ మల్టీనేషన్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మించారు. దీంతో కాలేజీల హెచ్‌ఓడీలు ప్లేస్‌మెంట్ల కోసం సంప్రదించాలని వీరి ఫోన్‌నంబర్లను వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశారు. ఈమేరకు నిరుద్యోగ యువత ఆయా నంబర్లకు ఫోన్‌చేయగా తొలుత రూ.35 వేలు, జీతం వచ్చాక మరో రూ.35 వేలు చెల్లించాలని సూచించారు. ఈ క్రమంలోనే ఖమ్మంకు చెందిన ఇద్దరు యువతులు రూ.70 వేలు చెల్లించాక కొద్దిరోజులకే ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి మార్చి 27న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా నిందితుల చేతిలో ఖమ్మంతో పాటు కరీంనగర్, నల్లగొండ, హైదరాబాద్, జగిత్యాల, గుంటూరు, రాజమండ్రి జిల్లాలో సుమారు 50 మంది మోసపోయారని తేలింది. ఐపీఎల్‌లో బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడిన నిందితులను ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఈ నెల 18న అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీపీ ఒక ప్రకటనలో వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


సైదులు (ఫైల్)

మిర్యాలగూడ: దామరచర్ల మండలం బొత్తలపాలెం వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. దామరచర్ల ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దాసారం గ్రామానికి చెందిన నకిరేకంటి సైదులు (53) బొత్తలపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శనివారం బైక్‌పై పాఠశాలకు వెళ్తూ /దామరచర్ల మండలం బొత్తలపాలెం వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పందించి వెంటనే అంబులెన్స్‌ను రప్పించి సైదులును ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో అతడికి గుండెపోటు రావడంతో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

దేవరకొండ: ఆర్టీసీ డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. పీఏపల్లి మండలం పుట్టంగండికి చెందిన ముడావత్ శంకర్ దేవరకొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగా శనివారం శంకర్ విధులకు హాజరయ్యాడు. అయితే తన కుమారుడికి గురుకుల ప్రవేశపరీక్ష ఉండడంతో తనకు ఆదివారం సెలవు కావాలని డీఎంను కోరాడు. సెలవు మంజూరు చేయడం కుదరదని డిపో మేనేజర్ చెప్పడంతో పాటు ఈ విషయాన్ని ఆర్టీసీ సీఐ వద్ద మాట్లాడుకోవాలని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన శంకర్ దేవరకొండ పట్టణంలోని తాటికోల్ రోడ్డు సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో పురుగుల మందు డబ్బాతో సెల్ఫీ వీడియో తీసుకున్న శంకర్ దీనిని స్థానిక వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు, పలువురు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని శంకర్‌ను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా.. ప్రస్తుతం శంకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దేవరకొండ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తాను శంకర్‌ను దుర్భాషలాడలేదని, గతంలో సైతం శంకర్ పలుమార్లు సెలవులు తీసుకున్నాడని పేర్కొన్నాడు.

బత్తాయి, కొబ్బరి చెట్లు దగ్ధం

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పరిధిలో శనివారం నిప్పంటుకొని బత్తాయి, కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన రైతు జంపాల మహేశ్వరరావు పెద్దదేవులపల్లి గ్రామ శివారులో తనకున్న 10 ఎకరాల వ్యవసాయ భూమిలో బత్తాయి, కొబ్బరి తోట సాగు చేశాడు. తోటకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. రైల్వేలైన్ సమీపంలో ఉండడంతో రైల్వే పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రూ.5లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

వరుస చోరీ నిందితుల అరెస్టు

- 41 తులాల బంగారం, రెండు కిలోల వెండి, ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి

భువనగిరి క్రైం: గత కొన్ని రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లాలో మహిళల మెడలో బంగారు ఆభరణాలే టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను యాదాద్రి భువనగిరి జోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి శనివారం భువనగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వెల్లడించారు. గత కొన్ని రోజులుగా యాదాద్రి భువనగిరి జోన్ పరిధిలోని పలు మండలాల్లో గుర్తు తెలియని ముఠా ఆరుబయట నిద్రించే మహిళలను టార్గెట్‌గా చేసుకుని, వారి మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్నారు. దీంతో సీపీ తరుణ్ జోషి పర్యవేక్షణలో యాదాద్రి జోన్ డీసీపీ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెంచారు. ఈక్రమంలో ఆలేరు మండలం జీడికల్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్ రావు ఆధ్వర్యంలో తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో ఆలేరు నుంచి బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతడిని విచారించారు. దీంతో చైన్ స్నాచర్ల విషయం బయటకు వచ్చింది. అతడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పొట్టేటి మరియాదాస్‌గా గుర్తించారు. మరియాదాస్‌తోపాటు, అతడి తమ్ముడు పొట్టెటి శాంతయ్య 16 సంవత్సరాల క్రితం వలిగొండ మండలం సంగెం గ్రామానికి వలస వచ్చి భార్యాపిల్లలతో ఉంటున్నారు. ఈ క్రమంలో మరియాదాస్‌కు మోత్కురు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కర్నె లక్ష్మితో నాలుగు సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. ఈమె భర్త చనిపోయాడు. అప్పటి నుంచి వీరు సహజీవనం సాగిస్తున్నారు. మరియాదాస్‌కు రెండు కుటుంబాలను పోషించడం కష్టంగా మారడంతో దొంగతనాలకు అలవాటుపడ్డాడు.


రివార్డు అందజేస్తున్న సీపీ తరుణ్ జోషి

ముఠాగా ఏర్పడి..

మొదట్లో మరియాదాస్ ఒంటరిగా దొంగతనాలకు పాల్పడేవాడు. 2019లో భువనగిరి పట్టణ పీఎస్ పరిధిలో దొంగతనానికి పాల్పడి 14 గొర్రెలను దొంగిలించాడు. ఈక్రమంలో కర్నె లక్ష్మి, అతడి తమ్ముడు శాంతయ్య, లక్ష్మికి సోదరుడు వరుసయ్యే మోటకొండూరు మండలం అమ్మనబోలుకు చెందిన బాణాల రాజేష్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా ఆత్మకూర్, ఆలేరు, మోత్కూరు, యాదగిరిగుట్ట, భువనగిరి రూరల్, మోటకొండూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. ఆలేరులో యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో వీరి నుంచి 41 తులాల బంగారం, రెండు కిలోల వెండి, ఒక ద్విచక్ర వాహనం, దోపిడీకి ఉపయోగించిన పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్ర, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ప్రభాకరరెడ్డి, యాదాద్రి ఏసీపీ రమేష్ కుమార్, పటోళ్ల మధుసూదన్ రెడ్డి, రవి కిరణ్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన యాదగిరిగుట్ట రూరల్ సీఐ కొండల్ రావు, తుర్కపల్లి ఎస్సై తక్యోద్దీన్, ఆలేరు ఎస్సై వెంకటశ్రీను, సిబ్బంది శ్రీనివాస్, ప్రదీప్ కుమార్, చొగని యాదగిరి, రవి నాయక్, మల్లిక, హరీష్‌లకు సీపీ తరుణ్ జోషి రివార్డు అందజేశారు.